# తాహతు

'ఖరీదు సుమారుగా ఒక్కటే అయినా టి.వి. కొనుక్కోవడానికి, ఫ్రిజ్ కొనుక్కోవడానికి తేడా ఉంది' అన్నాడు శశికాంత్.

"ఫ్రిజ్ టి.వి. కన్నా చవకనుకుంటాను. ఇంతకీ ఏమిటి తేడా?" అంది లీల

"టి.వి. కొనుక్కుంటే కరెంటు ఖర్చుతో సరిపోతుంది. ఫ్రిజ్ కొంటే ఐస్క్రీములూ, కూల్‌డ్రింకులూ, ఊరి చివర మార్కెట్ నుంచి కూరలు ఒకేసారి కొనుక్కోవడంలో ఆటో ఖర్చులూ - అన్నీ ఉంటాయి."

"మనకి రెండూ వద్దుకానీ, ఎందుకు చెప్తున్నారిదంతాను?"

"మా రంగనాథం బాబాయి ఈవేళ బజార్లో కనిపించి బాధపడ్డాడులే."

'ఎవరా రంగనాథం బాబాయి, ఏమా కథ?'

"మాకు దూరపు బంధువు, నీకు తెలియదులే. కథ విను."

లీల సరేనంటూ శశికాంత్ ఎదురుగా కూర్చుంది.

రంగనాథం మామూలు మధ్యతరగతి మనిషి, ఒక్కడే కొడుకు, ఒక్కర్తే అమ్మాయి. అమ్మాయికి లక్ష రూపాయల దాకా ఖర్చు చేసి పెళ్లి చేశాడు.

అబ్బాయి రాజశేఖర్ ఇంటర్మీడియట్ పాసయ్యాడు. ఎమ్‌సెట్‌లో ఏ రాంకూ రాలేదు. గవర్నమెంటు కాలేజిలో కాదు కదా - ప్రైవేటు కాలేజీలో కూడా సీటు వచ్చే అవకాశం లేదు. చాలా మంది పిల్లలు ఇంకోసారి పరీక్ష రాస్తే ఇంజనీరింగులో సీటు వస్తుందన్న ఆశతో ఒక ఏడు ఏ డిగ్రీలోనూ చేరకుండా ఫుల్‌టైం కోచింగ్ తీసుకుంటున్నారు. శేఖర్‌కూడా అలాగే చదువుతానన్నాడు.

రంగనాథానికి ఆ ఐడియా నచ్చలేదు.

"ఒక ఏడాది వేస్ట్ చేసుకోవడమెందుకు? కర్ణాటకలో బోలెడు డొనేషన్ కాలేజీలు ఉన్నాయటగా. ఎందులో ఒకందులో చేరి చదువుదువుగానీ."

"చాలా డబ్బు ఖర్చు అవుతుందిట కదా" అంది రంగనాథం భార్య.

"అయితే అవుతుంది. లక్ష రూపాయలు ఖర్చు పెట్టి కూతురి పెళ్లి చెయ్యలేదూ!

అలాగే లక్షరూపాయలూ ఖర్చు పెట్టి కొడుక్కి చదువు చెప్పిస్తాను. అంతే కానీ ఓ ఏడాది దండగ చేసుకోవడం ఎందుకు?"

రంగనాథం కొడుకుని తీసుకెళ్ళి కర్ణాటకలోని మారుమూల ఉన్న ప్రైవేటు కాలేజిలో చేర్చాడు. అతనికి తృప్తిగా ఉంది. కొడుకు మరీ తెలివి తక్కువ కుర్రాడు కాదు. కాంపిటీషన్ పెరిగిపోవడం వల్ల సీటు రాలేదు కానీ, ఇంజనీరింగు చదవడం శేఖర్‌కి కష్టమైన పని కాదు. "ఫీజులూ, హాస్టల్ ఫీజు కట్టి, పుస్తకాలు కొని, కొడుకు చేతిలో రెండువేలు పెట్టి 'అవసరమైతే బుక్స్ కొనుక్కో" అని చెప్పి వచ్చాడు రంగనాథం.

మళ్ళీ పదిహేను రోజులకే ఉత్తరం వచ్చింది.

"రెండు వేలు పంపించండి. చాలా అర్జెంటు ఖర్చులున్నాయి" అంటూ రాశాడు శేఖర్.

రెండు వేల రూపాయలు పంపుతూ డబ్బు జాగ్రత్తగా ఖర్చు పెట్టుకోమని రాశాడు రంగనాథం.

తిరుగు టపాలో ఉత్తరం వచ్చింది. "నేను ముందే ఇంకో ఏడు ఇంట్లో ఉండి చదువుతానన్నాను. నువ్వే నన్ను డొనేషన్ కాలేజిలో చేర్చావు. డబ్బు ఖర్చు కాకుండా ఎలా ఉంటుంది?"

సెలవులలో ఇంటికొచ్చిన కొడుకుని చూసి దిమ్మెరపోయాడు రంగనాథం. రెండు వేల రూపాయల ఖరీదు చేసే స్పోర్ట్స్ షూస్, దానికి తగ్గడ్రెస్, చెవులకి వాక్‌మన్, మెడలో కెమేరా.

"ఏమిట్రా ఈవేషం. నిన్ను చదువుకుందుకు పంపానా, ఆవారాలా తిరగమని పంపానా?"

"నేను చదువుతున్నానో, లేదో నా మార్కుల రిపోర్టు ఇంటికి రాగానే తేలిపోతుంది. ఇక ఈ మాత్రం ఖర్చు పెట్టకుండా ఎలా ఉండను. నా క్లాస్‌మేట్స్ చాలా మందికి వి.సి.ఆర్.లూ, హీరో హోండాలూ ఉన్నాయి తెలుసా? వాళ్ళ ముందు నేను ఎంత తీసికట్టుగా ఉన్నానో, నలుగురిలో ఎంత అవమాన పడుతున్నానో నీకేం తెలుసు?" అన్నాడు రాజశేఖర్.

ఆ విషయమే రంగనాథం శశికాంత్ దగ్గర చెప్పకుని ఏడిచాడు.

"శేఖర్ చెప్పింది నిజమేనా?" అంది లీల.

"నిజమే. మధ్య తరగతి పిల్లలు కొందరున్నమాట నిజమే కానీ ఎక్కువ మంది బిజినెస్‌మెన్ పిల్లలూ, వందెకరాల ఆసాముల పిల్లలూ మాత్రమే డొనేషన్ల కాలేజీలలో చేరగలరు. వాళ్లకి చదువు ఒక సరదా. వాళ్ల పాకెట్ మనీ మన నెలఖర్చుకన్నా ఎక్కువ ఉంటుంది. వాళ్లు వి.సి.ఆర్.లూ, మోటార్ సైకిళ్లతోటే కాలేజి కాంపస్‌లో దిగుతారు. పులిని చూసి నక్కలా శేఖర్ లాంటి వాళ్లు వాతలు పెట్టుకుంటారు."

"తప్పు శేఖర్‌దే నంటారా?"

"మా రంగనాథం బాబాయిదీ తప్పే. తాహతు చూసుకోకుండా ఏవనీ మొదలెట్టకూడదు. అక్కడ పిల్లల్లాగే శేఖర్ ఉండాలనుకోడం శేఖర్‌దీ తప్పే. ఇద్దరూ తాహతుని మర్చిపోయారు. శేఖర్ చదువయ్యేదాకా ఈ గొడవ ఉంటూనే ఉంటుంది."

(ఆంధ్రప్రభ వీక్లీ)